క్లుప్తంగా

రైతులకు విత్తనాల పంపిణీ

తగరపువలస : భీమిలి మండలం దాకమర్రి రైతుభరోసా కేంద్రంలో శుక్రవారం గ్రామ ఉద్యానవన శాఖ అసిస్టెంట్ భాగ్యరేఖ ఖరీఫ్‌కు సంబంధించి రైతులకు వరి విత్తనాలు పంపిణీ చేశారు. పంచాయతీ పరిధిలోని 430 మంది రైతులకు సంబంధించి విత్తనాలు సిద్ధం చేసినట్టు ఆమె తెలిపారు. ఎంటీయూ–1121 రకం విత్తనాలు సబ్సిడీ పోను కిలో రూ.34.80 పైసలు వంతున 45 క్వింటాళ్లు రైతులకు అందించారు. అలాగే రూ.32.80 పైసల వంతున సోనా మసూరి, రూ.36.80 పైసల వంతున సాంబా మసూరి విత్తనాలు అందుబాటులో ఉన్నాయన్నారు. 7 బస్తాల సోనా మసూరి, 16 బస్తాల సాంబా మసూరి విత్తనాలు రైతులకు అందించినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతులు, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

శ్రీవారికి పట్టు వస్త్రాల సమర్పణ


శ్రీవారికి సమర్పించేందుకు పట్టు వస్త్రాలు తీసుకొస్తున్న అర్చకులు

కొమ్మాది: రుషికొండలో గల శ్రీ మహాలక్ష్మి గోదాదేవి సహిత శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం వారాంతపు పూజలు అత్యంత వైభవంగా నిర్వహించారు. ముందుగా శ్రీవారిని ప్రత్యేకంగా అలంకరించేందుకు శేషవస్త్రం, అభిషేక సామగ్రిని ప్రదక్షిణగా మంగళ వాయిద్యాల నడుమ తీసుకెళ్ళి అభిషేకాలు నిర్వహించి, ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. ఈ కార్యక్రమంలో వేద పండితులు, అర్చకులు, ఆలయ అధికారులు పాల్గొన్నారు.

చంద్రంపాలెం హైస్కూల్ రిటైర్డ్ హెచ్‌ఎం మృతి


శ్యామల (ఫైల్)

మధురవాడ: చంద్రంపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పూర్వ ప్రధానోపాధ్యాయిని జి.శ్యామల(89) శుక్రవారం ఉదయం మృతి చెందారు. పాఠశాలలో నవంబరు 1987 నుంచి అక్టోబర్ 1993 వరకు ఇక్కడ పనిచేశారు. వయోభారంతో పీఎంపాలెం హౌసింగ్ బోర్డు కాలనీలో మృతి చెందినట్టు కుటుంబీకులు తెలిపారు. పాఠశాల అభివృద్ధిలో, విద్యా ప్రమాణాలు పెంపులో ఆమె తనదైన ముద్ర వేసుకున్నారు. ఆమె మృతిపై పాఠశాల పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు సంతాపం తెలిపారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు


తిరుపతి (ఫైల్)

పీఎం పాలెం: ఓ వ్యక్తి అదృశ్యంపై పీఎం పాలెం పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదయింది. ఇందుకు సంబంధించి స్థానిక సీఐ రామకృష్ణ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. స్టేషన్ పరిధిలోని పరదేశిపాలెంలో బొంగు తిరుపతి (52)కుటుంబంతో నివసిస్తున్నాడు. రోజు కూలీగా పని చేస్తున్న అతను ఈ నెల 4వ తేదీ ఉదయం 11 గంటలకు మధురవాడ వెళ్తున్నానని ఇంటి వద్ద భార్య పద్మకు చెప్పి వెళ్లాడు. మరలా తిరిగి ఇంటికి రాలేదు. ఆయన ఆచూకీ కోసం చుట్టు పక్కల వెదికినా ఫలితం లేకపోయింది. భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

గురుకుల పాఠశాలల్లో మిగులు సీట్ల భర్తీ

సబ్బవరం: ఉమ్మడి విశాఖ జిల్లా గురుకుల పాఠశాలల్లోని 2024–25 సంవత్సరానికి గాను మిగులు సీట్ల భర్తీకి సబ్బవరం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో శుక్రవారం ప్రవేశాలు కల్పించారు. ఉమ్మడి విశాఖ జిల్లాలోని 11 గురుకులాల్లోని బాలబాలికలకు 5వ తరగతిలో మిగులు సీట్ల భర్తీకి లాటరీ పద్ధతిలో ప్రవేశాలు కల్పించారు. ఉమ్మడి జిల్లాల సమన్వయకర్త ఎస్.రూపావతి అధ్యక్షతన కౌన్సెలింగ్ నిర్వహించారు. సుమారు 100 మంది విద్యార్థులు ప్రవేశాల కోసం హాజరయ్యారు.

రాకపోకలకు దారేది?

- మెయిన్‌రోడ్డుపై వాహనాల పార్కింగ్
- డివైడర్‌పై వ్యాపారాలు
- ఇరుగ్గా మారిన రహదారి
- వాహనదారుల అవస్థలు


ప్రైవేట్ మార్కెట్ ఎదురుగా డివైడర్‌పై చిరు వ్యాపారాలు


భీమిలి రోడ్డులో అడ్డదిడ్డంగా ద్విచక్రవాహనాల పార్కింగ్‌తో నిలిచిపోయిన ఆటోలు


మెయిన్‌రోడ్డును సగం ఆక్రమించి ద్విచక్ర వాహనాల పార్కింగ్


మెయిన్‌రోడ్డు మధ్యలో విశాలమైన డివైడర్

తగరపువలస: నియోజకవర్గంలోని ప్రధాన కేంద్రమైన తగరపువలసలో ట్రాఫిక్‌కు సంబంధించి వింత పరిస్థితి కనిపిస్తోంది. వాహనాల పార్కింగ్‌కు ఇక్కడ ఎలాంటి వసతులు లేకపోవడంతో వాటి యజమానులు ఎక్కడ పడితే అక్కడ వాహనాలను నిలిపి, వీలైతే తాళాలు వేసుకుని వెళ్లిపోతారు. పగటివేళ భారీ వాహనాలు తగరపువలస పట్టణంలోకి ప్రవేశించే అవకాశం లేనప్పటికీ ప్రతి వీధి, సందులోనూ వాహనాలు ఇష్టారాజ్యంగా తిష్ట వేసి సరుకులు లోడింగ్, అన్‌లోడింగ్ చేస్తుంటారు. ప్రతి రోజూ ఉదయం నుంచి సాయంత్రం వరకు బియ్యం, నూనెలు, సిమెంట్, హార్డ్‌వేర్, కూరగాయలు, కిరాణా, ఇటుక, ఇసుక తదితర భారీ లోడుతో వాహనాలు రోడ్డుకు అడ్డంగా పెట్టి దందా సాగిస్తుంటారు. ఇక తగరపువలస కేంద్రంగా నిత్యం 3వేల ఆటోలు రాకపోకలు సాగిస్తుంటాయి. దీంతో ప్రయాణ వాహనాల రాకపోకలకు సైతం నిత్యం నరకయాతనగానే ఇక్కడి రహదారులు ఉంటాయి. మెయిన్‌రోడ్డు పైకి వచ్చే సిటీబస్సులు సైతం ముందుకు కదలలేని పరిస్థితులు ఇక్కడ రోజూ కనిపిస్తుంటాయి.

చిరు వ్యాపారులకు అడ్డాగా..

మెయిన్‌రోడ్డులోని డివైడర్లను ఆధునికీకరించి, ఎత్తు చేసినప్పటికీ మొక్కలు వేయకపోవడంతో అవి చిరు వ్యాపారులకు అడ్డాగా మారాయి. అయిదడుగుల వెడల్పు 800 మీటర్ల పొడవునా ఉన్న డివైడర్లను ఎత్తు తగ్గించి ద్విచక్రవాహనాలకు పార్కింగ్‌గా మారిస్తే సగం ట్రాఫిక్ సమస్య పరిష్కారమైనట్టే. అయినప్పటికీ జీవీఎంసీకి ఈ సమస్య పట్టకపోవడంతో నిత్యం ట్రాఫిక్ పోలీసులకు తిప్పలు తప్పడం లేదు. అసలే ఇరుకైన రహదారులు ..వాటి పక్కనే ఉన్న డ్రైనేజీలను ఆక్రమించి వ్యాపారులు నిర్మాణాలు చేపట్టినా టౌన్ ప్లానింగ్ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరించడంతో ట్రాఫిక్ సమస్య మరింత జఠిలమవుతోంది.

రోడ్డును ఆక్రమించి వ్యాపారాలు

యజమానులు తమ వ్యాపార సంస్థల ముందు మెయిన్‌రోడ్డును సైతం చిరు వ్యాపారులకు అద్దెకు ఇచ్చి ప్రతి రోజూ రూ.వందల్లో వసూళ్లు చేస్తున్నారు. దీంతో వాహనాలు నడవవలసిన సగం రహదారి వ్యాపారుల కబంధ హస్తాలలో ఉండిపోవడంతో ఆటోలు, బస్సులు, కార్లు రాకపోకలకు తరచూ ఇబ్బందికరంగా ఉంటోంది. ప్రధాన రహదారులలోనే ఈ సమస్య ఉంటే మిగిలిన చిన్న మార్గాలలో కూడా వాహనాల రాకపోకలు సక్రమంగా జరగడం లేదు. తాతా థియేటర్ నుంచి ఆంధ్రా బ్యాంకు రోడ్డు, డీసీఆర్–గాంధీబొమ్మ రోడ్డు, భీమిలి రోడ్డు, మణికంఠ స్వీట్స్ వెనుక మార్గం, పాత లోకల్ ఆఫీసు వీధి పగలంతా వాహనాల పార్కింగ్‌తో అస్తవ్యస్తంగానే ఉంటున్నాయి. సర్వీస్ రోడ్లపైకి వస్తే బంగ్లామెట్ట నుంచి చిట్టివలస ఈఎస్‌ఐ ఆసుపత్రి మీదుగా సంగివలస వరకు, వెంకటేశ్వరమెట్ట నుంచి బాలాజీనగర్ మీదుగా ముగ్గురు అమ్మవార్ల ఆలయాల వరకు భారీ వాహనాల మరమ్మతులు, మెకానిక్ షెడ్లు, ఫౌండ్రీ వర్కులు, హోటళ్ల నిర్వహణ కారణంగా సామాన్య ప్రజలు ఏళ్ల తరబడి ఇబ్బందులు పడుతూనే ఉన్నారు. తగరపువలస గ్రామం, పంచాయతీ స్థాయి నుంచి భీమిలి మున్సిపాల్టీ, జీవీఎంసీలో విలీనం వరకు ఎదిగినా రహదారులపై వసతులు మాత్రం ఏభై ఏళ్ల నాటివే ఉన్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పట్టణీకరణకు అనువుగా రహదారులను తీర్చిదిద్దాలని కోరుతున్నారు

సీజనల్ వ్యాధులపై అవగాహన


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న జీవీఎంసీ అధికారులు


కొత్తపేట సామాజిక భవనంలో మహిళలకు అవగాహన కల్పిస్తున్న సచివాలయ సిబ్బంది

తగరపువలస : వర్షా కాలంలో సంభవించే వాతావరణ మార్పులతో సీజనల్ వ్యాధులు తలెత్తకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి సచివాలయ సిబ్బంది ప్రజలకు అవగాహన కల్పించారు. జీవీఎంసీ భీమిలి జోన్–1వ వార్డు కొత్తపేటలో శుక్రవారం జరిగిన ఈ కార్యకమంలో డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్ తదితర వ్యాధులు రాకుండా కాచి చల్లార్చిన నీటినే తాగాలని శానిటరీ సెక్రటరీ సురేష్ తెలిపారు. వర్షం నీరు ఇంటి చుట్టుపక్కల నిల్వ లేకుండా చూడాలని సూచించారు. పాలిథిన్ వ్యర్థాలు, ఖాళీ కొబ్బరి బొండాలు, పాత టైర్లు ఇంటి చుట్టు పక్కల లేకుండా చూడాలన్నారు. దోమలను నివారించడానికి జీవీఎంసీ సిబ్బందికి సహకరించి తడి, పొడి, ప్రమాదకరమైన చెత్తను వేర్వేరుగా సేకరించి ఇవ్వాలని కోరారు. ఈ అవగాహన కార్యక్రమంలో పిట్ట సురేష్, ఏఎన్‌ఎం సుగుణ, ఆశ కార్యకర్త సంతోషి, ఆర్పీ ఉమాగౌరి, అంగన్‌వాడీ నిర్వాహకురాలు వెంకట రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

జాగ్రత్తలతోనే వ్యాధులు దూరం..

మధురవాడ : సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు తగు జాగ్రత్తలు తీసుకోవాలని జీవీఎంసీ 6వ వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ సీతారాం చెప్పారు. శుక్రవారం డెంగ్యూ, మలేరియా నివారణ వారోత్సవాలలో భాగంగా కొమ్మాది రోడ్డులోని విజయం స్కూల్లో సీజనల్ వ్యాధులపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. తడి, పొడి చెత్త వేరు చేసి ఇవ్వాలన్నారు. నివాస ప్రాంతాల్లో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలన్నారు. మలేరియా సూపర్‌వైజర్ బేబిరాణి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో హెల్త్ సెక్రటరీ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నేడు, రేపు టాలెంట్ వార్ పోటీలు


పోస్టర్ ఆవిష్కరిస్తున్న మహ్మద్ షకీల్ తదితరులు


దాబాగార్డెన్స్ : మిరాకిల్ ఎంటర్‌టైన్‌మెంట్ క్లబ్ ఆధ్వర్యంలో ఈ నెల 6,7 తేదీల్లో టాలెంట్ వార్ పేరిట ప్రతిభా పోటీలు నిర్వహించనున్నట్టు క్లబ్ వ్యవస్థాపకుడు మహ్మద్ షకీల్ తెలిపారు. ఈ మేరకు సంస్థ కార్యాలయంలో శుక్రవారం పోటీల పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూచిపూడి, భరతనాట్యం, జానపద నృత్యం, వెస్టన్ డ్యాన్స్, సినిమా పాటలు, మ్యూజిక్ ఇన్‌స్ట్రుమెంట్స్, డ్రాయింగ్ అండ్ పెయింటింగ్, పిల్లలకు ఫ్యాన్సీ డ్రెస్, పెద్దలకు వస్త్రాలంకరణ పోటీలు ఉంటాయన్నారు. అన్ని వయస్సుల వారు పాల్గొనవచ్చని చెప్పారు. పౌర గ్రంథాలయం వేదికగా 6వ తేదీ సాయంత్రం 5 నుంచి రాత్రి 8.30 గంటల వరకు, 7వ తేదీ ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు ఈ పోటీలు ఉంటాయని, పాల్గొనదలచిన వారు 9966485335, 9553333134 నంబర్లలో సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలన్నారు.

ప్రథమ చికిత్సలో జాగ్రత్తలు పాటించాలి


ప్రథమ చికిత్సపై అవగాహన కల్పిస్తున్న డాక్టర్ ప్రవీణ్ కుమార్

పద్మనాభం: ప్రమాదాల్లో ఎముకలకు సంబంధించి గాయాలైనప్పుడు ప్రథమ చికిత్స చేసే సమయంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని విజయనగరం కాశీ ఆస్పత్రి అధినేత, వైద్యాధికారి మోపాడ ప్రవీణ్ కుమార్ సూచించారు. గ్రామీణ వైద్యులకు మండలంలోని కృష్ణాపురం వాసవి కన్యకా పరమేశ్వర ఆలయ ప్రాంగణంలో శుక్రవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ప్రథమ చికిత్స చేసేముందు వెన్ను పూస దెబ్బతిన్నదా లేదా, మెడ భాగంలో నరాలు చిట్లిపోయాయా అనేవి పరిశీలించాలన్నారు. ఎముకల వ్యాధుల గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మండల సామాజిక గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు రాలి అప్పారావు, కార్యదర్శి ఎం.వి.రమణ, సభ్యులు యు.తాతబాబు, పి.రామారావు, ఎం.వి.ప్రసాద్, గ్రామీణ వైద్యులు పాల్గొన్నారు.

విద్యార్థులకు కిట్ల పంపిణీ


మోడల్ స్కూల్ విద్యార్థులకు కిట్లు అందజేస్తున్న కార్పొరేటర్ వసంతలక్ష్మి

అల్లిపురం : విద్యార్థులు చక్కగా విద్యనభ్యసించాలని 33వ వార్డు కార్పొరేటర్ భీశెట్టి వసంతలక్ష్మి అన్నారు. డాబాగార్డెన్స్‌లో గల మహాత్మాగాంధీ మున్సిపల్ హైస్కూల్ విద్యార్థులకు కిట్లను ఆమె ముఖ్య అతిథిగా హాజరై అందజేశారు. అనంతరం మధ్యాహ్న భోజన పథకంలో భాగంగా విద్యార్థులకు అందిస్తున్న భోజనం రుచి చూశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఆర్‌వీవీఎస్ నాగభూషణం, ఉపాధ్యాయులు వి.సునీత, మంగమ్మదేవి, భీశెట్టి గోపి పాల్గొన్నారు.

మోడల్ స్కూల్‌లో..

అల్లిపురం మెయిన్‌రోడ్డులో గల జీవీఎంసీ మోడల్ స్కూల్‌లో జరిగిన కార్యక్రమంలో కార్పొరేటర్ భీశెట్టి వసంతలక్ష్మి, వెంకటేశ్వరమెట్ట–1 సచివాలయం అడ్మిన్ భార్గవ్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు కనకమహాలక్ష్మి విద్యార్థులకు స్టూడెంట్ కిట్లు అందజేశారు.

కళాశాలకు ఆర్‌వో ప్లాంట్ వితరణ


ఆర్‌వో ప్లాంట్‌ను అందజేసిన అధ్యాపకుడిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ విజయబాబు

మద్దిలపాలెం : డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు భౌతిక శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ శ్రావణ్‌కుమార్ ఆర్‌వో ప్లాంట్ అందజేశారు. ఈ మేరకు ఆర్‌వో ప్లాంట్‌ను శుక్రవారం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ.విజయబాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విద్యార్థులకు శ్రేష్ఠమైన తాగునీటి అందించాలనే సదుద్దేశంతో ఆర్వో ప్లాంట్ వితరణ చేయడం అభినందనీయమన్నారు. అధ్యాపకుడు శ్రావణ్‌కుమార్ మాట్లాడుతూ విద్యార్థులు ఈ ఆర్వో ప్లాంట్‌ను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం ఆయనను కళాశాల సిబ్బంది శాలువా కప్పి సత్కరించారు.

హ్యూమన్ జెనెటిక్స్ విభాగంలో అతిథి ఉపన్యాసం


కాంతి కారంచేటిని సత్కరిస్తున్న ప్రిన్సిపాల్ ఆచార్య ఎం.వి.ఆర్.రాజు

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం సైన్స్ కళాశాలలోని హ్యూమన్ జెనెటిక్స్ విభాగంలో శుక్రవారం అతిథి ఉపన్యాసం నిర్వహించారు. ఏక ఎడ్యుకేషనల్ అండ్ చారిటబుల్ ట్రస్ట్ స్పెషల్ ఎడ్యుకేటర్ కాంతి కారంచేటి అండర్ స్టాండింగ్ డిజెబిలిటీస్–డయాగ్నోసిస్ టు డిసెంట్ డ్రీమ్స్ అంశంపై ప్రసంగించారు. వివిధ రకాల డిజెబులిటీస్, చికిత్స విధానాలు, నివారణ అవకాశాలు వివరించారు. కుటుంబ సభ్యులు, పౌర సమాజం అనుకూల దృక్పథంతో మెరుగైన జీవనం అందించడానికి సహకారం అందించాలన్నారు. ఈ సదర్భంగా కాంతి కారంచేటిని విభాగం తరఫున సత్కరించారు. ఈ కార్యక్రమంలో సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎం.వి.ఆర్.రాజు, విభాగాధిపతి ఆచార్య వి.లక్ష్మి, విశ్రాంత ఆచార్యులు జి.పద్దయ్య, బయోటెక్నాలజీ, మైక్రో బయాలజీ, ఫుడ్ న్యూట్రిషన్ అండ్ డైటిక్స్ విభాగాల బోధన సిబ్బంది, విద్యార్థులు, పరిశోధకులు పాల్గొన్నారు.

పాఠశాలే పశువుల కొట్టం


ఆనందపురం జెడ్పీ హైస్కూల్ గేటుకు కట్టిన పశువులు

తగరపువలస : ఆనందపురం జెడ్పీ హైస్కూల్‌ను పశువుల కొట్టంగా మార్చేశారు స్థానికంగా ఉన్న పాడి రైతులు. తమ చిన్నారులకు విద్యా బుద్ధులు నేర్పిస్తున్న విద్యాలయాన్ని పశువుల శాలగా మార్చేసినా ఎదురు చెప్పలేని ఉపాధ్యాయులను చూసి ఇక్కడి తల్లిదండ్రులు జాలి పడుతున్నారు. ఇటీవల ఈ హైస్కూల్ గేటుకు స్థానికంగా ఉన్న పాడిరైతులు పాఠశాల తెరచి ఉన్న సమయంలోనూ కావాలనే పశువులను కట్టి వెళ్తున్నారు. దీంతో ఈ పశువులు విద్యార్థులపై తరచూ కొమ్ములు విసురుతున్నాయి. ఒకరిద్దరు ఉపాధ్యాయులు పశువుల యజమానులను మందలించినా పట్టించుకోవడం మానేసి దౌర్జన్యాలకు దిగుతున్నారని ఆందోళనకు గురవుతున్నారు. ముఖ్యంగా విద్యార్థులు విశ్రాంతి సమయంలో చిరు తిళ్ల కోసం కూడా బయటికి రాలేక లోపలే ఉండిపోవలసి వస్తోంది. విద్యార్థుల భద్రత కారణంగా విద్యాశాఖ, పోలీస్, మండల పరిషత్ అధికారులు జోక్యం చేసుకుని పాఠశాల ఆవరణలో పశువులు కట్టకుండా చర్యలు తీసుకోవాలని విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.

దుర్గాలమ్మకు విశేష పూజలు


విశేష అలంకరణలో చంద్రంపాలెం దుర్గాలమ్మ


అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు

మధురవాడ : చంద్రంపాలెం జాతర గట్టు దుర్గాలమ్మ ఆలయంలో జ్యేష్ఠమాసం బహుళ పక్షం అమావాస్యని పురస్కరించుకుని శుక్రవారం అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. నిత్య పూజా కార్యక్రమాలతో ప్రారంభించి ప్రత్యేక కుంకుమార్చనలు, పుష్పార్చనలను అర్చకులు పట్నాల హరిప్రసాద్‌శర్మ, మూర్తిశర్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. అమావాస్య శుక్రవారం కావడంతో మహిళలు విశేషంగా హాజరై కుంకమ పూజలు చేశారు. పులిహోర, ఇతర ప్రసాదాలు అమ్మకి నివేదించి భక్తులకు పంచి పెట్టారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు పిల్లా సూరిబాబు, నాగోతి తాతారావు, కార్యవర్గ సభ్యులు పీవీజీ అప్పారావు, గ్రామపెద్దలు పిల్లా కృష్ణమూర్తి పాత్రుడు, పిల్లా రాము, పిల్లా శ్రీనివాసరావు, పీసరామారావు, పిల్లా సూరిపాత్రుడు తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంలో ముందుండాలి


కార్యవర్గ సమావేశంలో మాట్లాడుతున్న రామ్మోహనరావు

మధురవాడ : ప్రజా సమస్యల పరిష్కారంలో బీజేపీ నాయకులు ముందుండాలని ఆ పార్టీ విశాఖ పార్లమెంటరీ కన్వీనర్ సరిపిల్లి రామ్మోహనరావు అన్నారు. శుక్రవారం సాయంత్రం మిథిలాపురి వుడా కాలనీలో గల పార్టీ కార్యాలయంలో భీమిలి నియోజకవర్గ కో కన్వీనర్ పసుపులేటి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో 7వ వార్డు విస్తృత సమావేశం, అనంతరం కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా రామ్మోహనరావు మాట్లాడుతూ సమస్యల పరిష్కారంతోనే పార్టీకి, నాయకులకు గుర్తింపు వస్తుందని చెప్పారు. కార్యక్రమంలో కో కన్వీనర్ శ్రీనివాసరావు, వివిధ విభాగాలు నాయకులు మరువాడ ఉదయ్‌భాస్కర్, యండ అప్పారావు, ఎస్. తిరుపతిరావు, దుర్గాసి రాము, పసుపులేటి శివకుమార్, రమ్య, పి. శంకర్రావు, ఆర్. లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ప్రవేశాలలో బాలికల జెడ్పీ హైస్కూల్ భేష్

- డీఈవో ప్రశంసలు


చిట్టివలస జెడ్పీ బాలికల హైస్కూల్ ఉపాధ్యాయినులతో డీఈవో చంద్రకళ

తగరపువలస: నాలుగేళ్ల క్రితం 150 మంది విద్యార్థినులతో ఉండే చిట్టివలస జెడ్పీ బాలికల హైస్కూల్‌లో విద్యార్థుల సంఖ్య ఇప్పుడు 305 మందికి చేరడంతో జిల్లా విద్యాశాఖాధికారి ఎల్.చంద్రకళ ఇక్కడి ప్రధానోపాధ్యాయిని రోజామణిని, ఇతర ఉపాధ్యాయినులను అభినందించారు. శుక్రవారం ఆమె పాఠశాలను సందర్శించారు. చుట్టూ అనేక ప్రైవేట్ విద్యాసంస్థలు, ప్రభుత్వ హైస్కూళ్లు ఉన్నా ఈ ఏడాది 100కు పైగా ప్రవేశాలు సాధించడంపై ఆమె ప్రత్యేకంగా అభినందించారు. తరగతి గదులకు వెళ్లి, విద్యార్థుల పుస్తకాలను పరిశీలించారు. ముఖ్యంగా హిందీ పాఠ్యాంశాలను చదివించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఇటీవల నాడు–నేడులో జరిగిన అదనపు తరగతి గదుల నిర్మాణం, ఆర్వో ప్లాంట్ తాగునీరు వంటి వసతులను పరిశీలించి ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు.